మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



ద్విచక్ర వాహనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ



మినరల్ వాటర్ ప్లాంటు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. శనివారం స్థానిక బెస్తవీధిలోని సత్యమ్మ ఆలయం ఆవరణలో మత్స్యకారులకు మంజూరైన ద్విచక్ర వాహనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్య ఉత్పత్తుల వినియోగం పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సబ్సిడీపై నిరుద్యోగ యువతకు ఫిష్ వెండింగ్ వాహనాలు, ద్విచక్ర వాహనాలను అందిస్తున్నాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో మత్స్యకారుల జీవితాలు మరింత మెరుగుపడనున్నాయని తెలిపారు. ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకునేందుకు ఫిష్ ఆంధ్ర రిటైల్ షాపులను కూడా అందుబాటులోకి తెచ్చిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మత్స్యకారుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఉప సంచాలకులు శాంతికుమారి, ఎఫ్‌డీఓ కిరణ్‌కుమార్, కుడా చైర్మన్ గురుమోహన్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లాబకాష్, వైవీయూ పాలక మండలి సభ్యుడు కె.సి.సుబ్బారావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, వార్డు ఇన్‌చార్జి రమేష్‌బాబు, బ్రాహ్మణపల్లె సర్పంచ్ లక్ష్మీదేవి, మత్స్య సహకార సంఘం అధ్యక్షులు మిరప్పల్లె వెంకటరమణ, ఉపాధ్యక్షుడు నాగేంద్రరావు, కార్యదర్శి వెంకటయ్య, మత్స్య సహాయకులుడు కొండయ్య, మత్స్యకారులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం

అట్లూరు : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మండల పరిధిలోని చెండువాయి, మద్దూరు, అక్కిరెడ్డిగారిపల్లి, చెర్లోపల్లి పునరావాస కాలనీలలోని నీటిలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉండడంతో కాలనీ వాసులు సమస్యను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన రూ.5లక్షలు నిధులు కేటాయించారు. అలాగే జెడ్పీటీసీ సభ్యురాలు అందూరు నరసమ్మ రూ.1.5 లక్షలు జెడ్పీ నిధులు కేటాయించడంతో మినరల్ వాటర్ ప్లాంటు నిర్మాణం పూర్తయింది. దీంతో శనివారం ఎమ్మెల్యే డాక్టరు మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో విద్య, వైద్యం, సంక్షేమంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ రొండా మాధవరెడ్డి, మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, స్థానిక సర్పంచ్ అట్లూరు యల్లమ్మ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు సిద్దవటం పెంచల్‌రెడ్డి, డీలర్ కృష్ణారెడ్డి, సుబ్బరాయుడు, రమణయ్య, గంగిరెడ్డి, రామిరెడ్డి కృష్ణారెడ్డి, యల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

అట్లూరు : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బత్తల పెంచలయ్య కుటుంబానికి రూ.2 లక్షల చెక్కును బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ శనివారం అందజేశారు. గాండ్లపల్లి గ్రామానికి చెందిన పెంచలయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి చెందిన చెక్కును మృతుని భార్య రమణమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఏ చైర్మన్ మాధవరెడ్డి, మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, స్థానిక సర్పంచ్ ఎల్లమ్మ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేష్, కృష్ణారెడ్డి, పెంచల్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీ మెంబర్ల పాత్ర కీలకం

పోరుమామిళ్ల : రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే బూత్ లెవల్ కమిటీ సభ్యులు (బీఎల్‌ఓలు) ప్రజలతో మమేకం కావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బూత్ కమిటీ మెంబర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఒక్కో సచివాలయం పరిధిలో ముగ్గురు బూత్‌కమిటీ మెంబర్లను నియమించామన్నారు. వారు నిత్యం వారి పరిధిలో ఉన్న ఓటర్లను కలుస్తూ, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. సమావేశంలో పీఆర్ అండ్ ఆర్‌డీ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, ఆప్కాస్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ బాషా, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కె. రమణారెడ్డి, సచివాలయాల కన్వీనర్ రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి చాపాటి లక్ష్మీనారాయణరెడ్డి, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, మండలంలోని బూత్ కమిటీల మెంబర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

ఆరోగ్యశ్రీ కార్డుతో 3,257 వ్యాధులకు చికిత్స

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రభుత్వం మంజూరు చేసిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా 3,257 వ్యాధులకు చికిత్స చేయించుకోవచ్చని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక నాలుగో వార్డు వైఎంఆర్ కాలనీలో ఉన్న వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆయన ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏడాదికి రూ.5లక్షలు మాత్రమే ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా వైద్యం చేయించుకునే పరిస్థితి ఉండేదన్నారు. ఆ మొత్తాన్ని ప్రస్తుతం ప్రభుత్వం రూ.25లక్షలకు పెంచిందని తెలిపారు. ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మంచి చేసిన ప్రభుత్వాన్ని తిరిగి గెలిపించుకోవాల్సిన అవసరం ప్రజలపై ఉందన్నారు. వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పగిడాల దస్తగిరి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేశ్వరరెడ్డి, ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ, డాక్టర్లు శివప్రసాదరెడ్డి, హిమబిందు, సీఓ సుబ్బారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీ కార్డును అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

పారిశుధ్య కార్మికులకు అండగా ఉంటా

ప్రొద్దుటూరు : తన మాటను విశ్వసించి మధ్యలోనే సమ్మెను విరమించి విధుల్లో చేరిన కార్మికుల సేవలను ఎప్పటికీ తాను గుర్తుంచుకుంటానని, ఏ ఆపద వచ్చినా వారికి అండగా ఉంటానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మధ్యలోనే సమ్మె విరమించిన 68 మందితోపాటు కరోనా సమయంలో విధుల్లో చేరిన 92 మంది పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే సంక్రాంతి కానుకగా నిత్యావసర వస్తువులతోపాటు దుస్తులు పంపిణీ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఏసీపీ మునిరత్నం, కౌన్సిలర్లు వంశీధర్‌రెడ్డి, పిట్టా బాలాజీ, కమాల్, గరిశపాటి లక్ష్మీదేవి, గుర్రం లావణ్య, రాగుల శాంతి, అరుణ, సత్యం, కోఆప్షన్‌సభ్యుడు మల్లికార్జున ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరులో నేటి నుంచి సంక్రాంతి ఉత్సవాలు



శ్రీలక్ష్మీ మాధవరాయస్వామి

మైదుకూరు : మైదుకూరులో ఆదివారం నుంచి సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించనున్నారు. పట్టణంలోని శ్రీలక్ష్మీ మాధవ ఆంజనేయ స్వామి ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయంలో ఏటా ధనుర్మాసం నుండి ప్రత్యేక పూజలు, సంక్రాంతి ఉత్సవాలతో పాటు మైదుకూరు పరిసర గ్రామాల్లో పారువేట కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా ఏళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. చారిత్రక గండికోట దుర్గం నుండి కొన్ని కారణాల వల్ల మైదుకూరులో ప్రతిష్ఠించబడిన శ్రీలక్ష్మీ మాధవరాయస్వామికి ఏటా సంక్రాంతి ఉత్సవాలను కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఈనెల 14వ తేదీ ఆదివారం భోగి పండుగ, 15వ తేదీ సోమవారం మకర సంక్రాంతి, 16వ తేదీ మంగళవారం కనుమ పండుగ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆది, సోమవారాల్లో శేష వాహనం, గజవాహనంపై శ్రీలక్ష్మీ మాధవరాయ్వామికి గ్రామోత్సవం నిర్వహిస్తారు. మంగళవారం కనుమ పండుగ నాడు మాధవరాయుడు అశ్వ వాహనంపై ఊరేగి, అనంతరం పరిసర గ్రామాల్లో పారువేటకు బయలుదేరే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని ఆలయ పాలకవర్గం కోరింది.

నీటి సమస్యను పరిష్కరించిన మున్సిపల్ వైస్ చైర్మన్

ప్రొద్దుటూరు : స్థానిక 11వ వార్డు పరిధిలోని సార్వకట్ట వీధిలో తాగునీరు సక్రమంగా రావడం లేదని వార్డు ఇన్‌చార్జి కసిరెడ్డి మహేశ్వరరెడ్డి తెలపడంతో మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి పైపులైన్ మరమ్మతులు చేయించి నీరు సరఫరా చేయించారు. సంక్రాంతి పండుగ పూట ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో వెంటనే పనులు పూర్తి చేయించామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ ఏఈ దస్తగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గురునాథరెడ్డి పాల్గొన్నారు.



పైపులైన్ మరమ్మతు పనులను చేయిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి

ఆకట్టుకున్న రంగవల్లులు

మైదుకూరు : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మైదుకూరులో శనివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రాచమల్లు రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీలో పాల్గొన్న మహిళలు, సంక్రాంతి పండుగ ఉట్టిపడే విధంగా రంగులతో చక్కటి ముగ్గులు వేసి చూపరులను ఆకట్టుకున్నారు. గంట వ్యవధిలో మహిళలు రంగవల్లులను చుక్కలతో తీర్చిదిద్దారు. పోటీలో మొదటి బహుమతి ఎ.లతకు రూ.20వేలు, రెండో బహుమతి జి.లలితకు రూ.10వేలు, మూడో బహుమతి డీపీ లక్ష్మీదేవికి రూ.6వేలు నిర్వాహకులు నగదు బహుమతులను వైఎస్సార్ ఆర్కిటెక్చర్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు పి.ప్రసన్నకుమారి, బి.అమ్మణ్ణి, వి.రమాదేవి చేతుల మీదుగా అందజేశారు. నాలుగో బహుమతి ఆర్.శివవాణికి రూ.4వేలు, ఐదో బహుమతి ఎస్.హరితకు రూ.2వేలు, కన్సోలేషన్ బహుమతి కింద 20 మందికి ఒక్కొక్కరికి రూ.1000తో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు రూ.1,500 విలువైన చీరను బహుమతిగా ఇచ్చారు.



బహుమతులను అందజేస్తున్న ప్రొఫెసర్లు

సీబీఐటీలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



సీబీఐటీలో సంక్రాంతి సంబరాలలో భాగంగా భోగి మంటల వద్ద అధ్యాపకులు, విద్యార్థులు

చాపాడు : మండలంలోని పల్లవోలు వద్ద గల చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)కాలేజీలో శనివారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా భోగి మంటలు, గాలి పటాలు, బొంగరాలు తిప్పటం వంటి కార్యక్రమాలు చేపట్టారు. పల్లెటూరు వాతావరణం కన్పించేలా పూరి గుడిసెలు, బోదకొట్టాలను అందంగా తయారు చేశారు. సంక్రాంతి వంటకాలతో వివిధ రకాలైన స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీబీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే



మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : నూతనంగా నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రారంభించారు. ఖాజీపేట మండలం కుమ్మరకొట్టాలు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ వారి ఆర్థిక సహకారంతో ఈ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించగా వైఎస్సార్‌సీపీ మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్దిక్, సర్పంచ్ గంగిరెడ్డి సుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి, సచివాలయ కన్వీనర్ గాజులపల్లె రామసుబ్బారెడ్డి, జంపన గంగిరెడ్డి, తవ్వా ఓబుల్‌రెడ్డి, గంగదేవర శేఖర్, భీరం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామపూజిత అంక్షితల పంపిణీ

పోరుమామిళ్ల: ఈనెల 22న అయోధ్యలో రామమందిర ప్రారంభ సందర్భంగా పట్టణంలో రామపూజిత అక్షింతలు పంపిణీ చేశారు. నరసింహులు, నాగేంద్ర, నారాయణరెడ్డి, సుబ్బారావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామానికి చెందిన పూలచెట్ల లక్ష్మయ్య అనే వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతున్నాడని సమాచారం రావడంతో ఆ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.తులసి నాగప్రసాద్ శనివారం తెలిపారు. 7 మద్యం బాటిళ్లను సీజ్ చేశామన్నారు.

నేడు ముగ్గుల పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వినాయక నగర్‌లోని దేవాంగ కల్యాణ మండపంలో దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా దేవాంగ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం తెలిపారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ రాగా నాగలక్ష్మీ, కౌన్సిలర్ పోసా వరలక్ష్మి పాల్గొంటారని తెలిపారు. దేవాంగ కల్యాణ మండపం అధ్యక్షుడు రెడ్డి చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, దేవాంగులు పాల్గొన్నారు.

రేపు చియ్యపాడులో కల్యాణోత్సవం

చాపాడు : మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలో జనమేజయ మహారాజు ప్రతిష్టించిన లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయంలో సంక్రాంతి సందర్భంగా సోమవారం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు



రఘురామిరెడ్డి, శాసనసభ్యులు

చాపాడు : నియోజకవర్గంలో గతేడాది కష్టనష్టాలు మరచి రైతులు, ప్రజలు ఈ ఏడాది పొడవునా పాడి పంటలతో తులతూగుతూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

పోలీసులకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రాలు అందుకున్న సిబ్బంది

బద్వేలు అర్బన్ : బద్వేలు రూరల్ స్టేషన్ పరిధిలో 2021లో జరిగిన డిగ్రీ విద్యార్థిని శిరీష హత్య కేసులో ముద్దాయిలకు యావజ్జీవ కారాగార శిక్ష పడేందుకు కృషి చేసిన పోలీసు సిబ్బందిని శనివారం జిల్లా ఎస్పీ సిద్ధార్థకౌశల్ అభినందించారు. ఫాస్ట్‌ట్రాక్ కేసుగా పరిగణించి తగిన సాక్ష్యాధారాలతో నేర నిరూపణకు కృషి చేసిన రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్, ఏఎస్ఐ ఆర్.వి.నరసింహారావు, కోర్టు కానిస్టేబుల్ ఎ.సురేష్‌బాబు, కోర్టు మానిటరింగ్ సెల్ హెడ్ కానిస్టేబుల్ జాకబ్‌లను అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. మున్ముందు ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించి నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఎస్పీ కోరారు.

రేపు వెల్లాలలో పార్వేట మహోత్సవం

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో సోమవారం పార్వేట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఈఓ బీవీ నరసయ్య, ఆలయ చైర్‌పర్సన్ కానాల విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా స్వాములకు ప్రత్యేక పూజల అనంతరం హనుమత్ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామి, నంది వాహనంపై గంగా పార్వతి సమేత భీమలింగేశ్వరస్వామివార్లకు పార్వేట మహోత్సవం నిర్వహిస్తారన్నారు. ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి తెలిపారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



తులసి నాగప్రసాద్

రాజుపాళెం:రాజుపాళెం మండల ఎస్ఐగా పి.తులసి నాగప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ రాజగోపాల్ కడపకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. రోడ్లపై మద్యం తాగుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ముందుగా ఏఎస్ఐ సుబ్బారెడ్డి, పోలీసులతో ఆయన సమావేశం నిర్వహించారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల ఆందోళనలో భాగంగా శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి పుట్టపర్తి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్, మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి సాల్మన్ పాల్గొన్నారు.

పాండురంగడికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న రుక్మిణి పాండురంగస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మనోజీరావు వీధిలోని శ్రీ రుక్మిణి పాండురంగ స్వామి ఆలయంలో శనివారం శ్రవణా నక్షత్ర పర్వదినం సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని సామూహికంగా విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. అనంతరం మధ్యాహ్నం శ్రవణా నక్షత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో 400 మంది భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. రాత్రి రుక్మిణి పాండు రంగస్వామి ఉత్సవ మూర్తులకు ఊంజల్ సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నివాళి

కలసపాడు : మండలంలోని సింగరాయపల్లెకు చెందిన ఓసూరి సౌరయ్య శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఈయన మండలంలోని పుల్లారెడ్డిపల్లె సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి శనివారం సౌరయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని మనోధైర్యం చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అంకన గురివిరెడ్డి, సూదా రామకృష్ణారెడ్డి, సుదర్శన్, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, వీరారెడ్డి, సింగరయ్య, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలు



మండల స్థాయిలో క్రికెట్ పోటీలలో విజేతగా నిలిచిన నక్కలదిన్నె జట్టు

చాపాడు : ఆడుదాం ఆంధ్రా క్రీడలలో భాగంగా నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలు శనివారంతో ముగిశాయి. మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో జరిగిన క్రికెట్ పోటీలలో గెలుపొందిన 15 జట్లకు మండల స్థాయిలో అన్నవరం గ్రామంలో పోటీలు నిర్వహించారు. శనివారం వెదురూరు–నక్కలదిన్నె గామ సచివాలయ జట్లు పోటీ పడగా నక్కలదిన్నె జట్టు విజయం సాధించింది. నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన నక్కలదిన్నె క్రీడాకారులను ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో కొలువైన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పుష్యమాసం మొదటి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక ఆర్ట్స్‌కాలేజి రోడ్డులోని భావనారుషి కల్యాణ మండపంలో శనివారం పద్మశాలి ఉద్యోగ సంక్షేమ సంఘం క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర కోశాధికారి తాడూరి చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోము జ్ఞానశంకర్, అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు వద్ది నరసింహులు, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి మాట్లాడుతూ పద్మశాలి ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి విజయకుమార్, జానపాటి వెంకటలక్ష్మి, రాటాల గోపి, గునిశెట్టి సాయి తదితరులు పాల్గొన్నారు.